ప్రజాశక్తి

గురువారం 14 డిసెంబరు 2023 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



జగ్గయ్యపేటలో మీడియాతో మాట్లాడుతున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

తగ్గిన క్రైమ్ రేట్

డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి ● ఎన్‌టిఆర్ జిల్లా నేర సమీక్షపై సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం క్రైమ్ రేట్ తగ్గిందని రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధర్మవరప్పాడు తండా గ్రామ సమీపంలోని రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం 2023 సంవత్సరపు ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై శారీరక, మానసిక వేధింపులు, హత్యలు, మానభంగాలు, వరకట్న వేధింపులు వంటివి తగ్గాయన్నారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా స్పందన, దిశ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. క్రైమ్ రేట్ తగ్గించడంలో భాగస్వాములైన పోలీసులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై ముఖ్యంగా ద్విచక్ర, త్రి చక్ర వాహనల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న దశ్య ఈ ప్రమాదాలపై ప్రత్యేక దష్టి సారించినట్లు తెలిపారు. ప్రమాదాలపై సర్వే నిర్వహించామని, ఈ ప్రమాదాలు ఎక్కువగా మధ్యాహ్నం 12 నుండి రాత్రి వరకు ఇవి జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనాలు అతివేగంగా డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా పోలీసు పెట్రోలియం ఏర్పాటు చేయడంతోపాటు భారీ కేడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపామని వివరించారు. ఒరిస్సా రాష్ట్రం నుండి మన రాష్ట్రంలోకి గంజాయి అక్రమంగా రవాణా అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దష్టి సారించామని తెలిపారు. ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గంజాయి పంటలను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలతో పోలీసులు మర్యాదగా వ్యవహరించేలా చూస్తున్నామని, ఎన్టీఆర్ కమిషనర్ పరిధిలో జరుగుతున్న నేరాలపై ప్రత్యేకంగా కానిస్టేబుల్ నుండి ఎస్‌పి వరకు చర్చించి తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈనేర సమీక్ష సమావేశంలో విజయవాడ నగర సీపీ క్రాంతి రాణా టాటా, డిసిపిలు విశాల్ గున్ని , అజిత వేజెండ్ల, మోకా సత్తిబాబు, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆదుకోండి

కేంద్ర బృందానికి బాధిత రైతుల మొర

ప్రజాశక్తి- కృష్ణాప్రతినిధి

పెనమలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం కేంద్ర బృందం పరిశీలించింది. తడిసిన ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టుకున్న దశ్యాలను చూసి రైతులతో మాట్లాడారు. కంకిపాడు మండలం దావులూరులో నీటిలో మునిగి ఉన్న పొలాన్ని పరిశీలించి రైతు సాంబశివరావుతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుంది. వర్షం నీటిలో పంట ఒరిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆ రైతు కేంద్ర బందం వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఆదుకోవాలని మొరపెట్టుకున్నాడు. అనంతరం విజయవాడ–మచిలీపట్నం రహదారి పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించింది. పామర్రు మండలం నిమ్మలూరులో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడింది. ఆత్మూరి రామ కోటేశ్వరరావు అనే రైతు తాను 20 ఎకరాల కౌలు రైతునని, తుపానుతో పూర్తిగా నష్టపోయానని కేంద్ర బృంద సభ్యులకు తెలిపాడు. గుడివాడ నియోజకవర్గంలోని రామనపూడి, వలి వర్తపాడు గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను బృందం పరిశీలించింది. రోడ్లపై ధాన్యాన్ని ఆరపెట్టుకుంటున్న రైతు గొరిపర్తి వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. వరి పంట ఎక్కువగా చేతికి వచ్చే దశలో దెబ్బతిందని పలువురు రైతులు కేంద్ర బృందానికి మొరపెట్టుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ కేంద్ర బందానికి వివరించారు.



కంకిపాడు మండలం దాములూరులో తుపాను నష్టం ఫొటోలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కేంద్రం నిధులు విడుదల చేయాలి : ఎంఎల్‌ఎలు సారథి, అనిల్ విజ్ఞప్తి

పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని అధికార, విపక్ష పార్టీలు, రైతు, ఎపి రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. పంటలు ముంపునకు గురై తీవ్ర నష్టం

(మిగతా 6లో)

నేడు ఎన్‌టిఆర్ జిల్లాలో కేంద్ర బందం పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 14వ తేదీన ఎన్‌టీఆర్ జిల్లాలో కరువు మండలాల స్థితిగతుల అధ్యయనానికి కేంద్ర బందం (ఐఎంసీటీ) పర్యటించనుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు మండలం లక్ష్మీపురం, ఎర్రమాదుబీ గంపలగూడెం మండలం గుల్లపూడి గ్రామంలో కేంద్ర బందం పర్యటిస్తుందని తెలిపారు. వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుస్వామి, ఎక్స్‌పెండిచర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ కుమార్, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అండర్ సెక్రటరీ కైలాశ్ శంక్లా ఈ బృందంలో ఉంటారని తెలిపారు.

లక్ష్యాల మేరకు సమగ్ర భూ సర్వే : జెసి

వార్త 6లో

వైసిపిలో భారీ మార్పులు?

● మంత్రి, మాజీ మంత్రులకూ టికెట్లు సందేహమే ! ● కొందరికి స్థానం చలనం, మరికొందరికి రిక్తహస్తం

ప్రజాశక్తి - డెస్క్: వైసిపిలో భారీ ప్రక్షాళన ప్రారంభమైందా ? అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి వచ్చే ఎన్నికలకు సిద్ధం చేస్తున్న అభ్యర్థుల జాబితాలో ఈసారి ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీగా మార్పులు, చేర్పులు జరగవచ్చని తెలిసింది. ఈ చేర్పులు మార్పుల్లో మంత్రి జోగి రమేష్‌తోపాటు మాజీ మంత్రులు పేర్ని వెంకట్రామయ్య (నాని), వెలంపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణాజిల్లాలో ఏడు నియోజకవర్గాలకుగాను ఆరు నియోజకవర్గాల్లో వైసిపి ఎంఎల్‌ఎలున్నారు. పెనమలూరుకు కొలుసు పార్థసారథి, పామర్రుకు కైలే అనిల్‌కుమార్, అవనిగడ్డకు సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నంనకు పేర్ని వెంకట్రామయ్య (నాని), పెడనకు జోగి రమేష్, గుడివాడకు కొడాలి వెంకటేశ్వరరావు (నాని) ఉండగా, గన్నవరం నుండి టిడిపి తరపున గెలిచిన వల్లభనేని వంశీ కూడా ఆ తర్వాత వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మార్పులు జరగబోతున్నట్లు తెలిసింది. వీరిలో కొందరిని మరో నియోజకవర్గానికి మార్పు చేసే అవకాశం కూడా ఉన్నట్లు తెలిసింది. మంత్రి జోగి ప్రాతినిధ్యం వహిస్తున్న పెడన, మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు పేర్ని ప్రాతినిధ్యం వహిస్తున్న మచిలీపట్నం నియోజకవర్గాలతోపాటు సింహాద్రి రమేష్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న అవనిగడ్డలోనూ మార్పులు ఉంటాయని తెలిసింది. మచిలీపట్నంలో పేర్ని నాని మార్చి ఆయన కుమారుడికి టికెట్ ఇవ్వొచ్చని తెలిసింది. అలాగే అవనిగడ్డ ఎంఎల్‌సి సింహాద్రి రమేష్‌బాబుకు ఈసారి టికెట్ దక్కకపోవచ్చని సమాచారం.



అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమతోపాటు నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట నియోజవర్గాల్లోనూ మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడైన విజయవాడ పశ్చిమ ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావుకు ఈసారి టికెట్ దక్కకపోవచ్చని సమాచారం. అలాగే సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణును కూడా మార్చవచ్చని సమాచారం. ప్రభుత్వ విప్, టిడిపి బోర్డు సభ్యులుగా ఉన్న జగ్గయ్యపేట

(మిగతా 6లో)



విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



మచిలీపట్నంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

వార్తలు లోపలి పేజీల్లో

అంగన్వాడీలకు మద్దతు

రెండో రోజూ కొనసాగిన సమ్మె

డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో రెండో రోజు బుధవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది. సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఐసిఐయు, బిఎస్‌పి తదితర పార్టీలు, సంఘాల నాయకులు అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి మద్దతుగా మాట్లాడారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేదిలేదని, సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు హెచ్చరిక - రెండో రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఎంతటి నిర్బంధాలు, వత్తిళ్లు ఎదురయినా సమ్మె ఉధృతమవుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. వేతనాలు పెంపు, గ్రాట్యూటీ మంజూరు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయవాడలోని ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది.

ప్రజాశక్తి - విజయవాడ : రెండోరోజు అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.జగలక్ష్మీ అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్.నరసింగరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 4న అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీనట్లు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహించి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలను వర్కర్లుగా గుర్తించి, వారికి వేతనాల పెంపుతో పాటు గ్రాట్యూటీ, ఇతర సదుపాయాలు కల్పించాలని గత ఏడాది ఏప్రిల్ మాసంలో సుప్రీం కోర్టు స్వయంగా తీర్పునిచ్చిన అంశాన్ని గుర్తు చేశారు. ఐసిడిఎస్ అనేది ఒక సంస్థ అని, సర్వీసు కండీషన్ల ప్రకారం పని చేస్తున్న అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సదుపాయాలు మంజూరు చేయాలని కోర్టులు స్పష్టం చేస్తున్నా...తప్పుడు వాదనలతో, జీతం ఎగ్గొట్టడానికి ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తుందని దుయ్యబట్టారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సమ్మెకు సంపూర్ణ మద్దతునిచ్చి మాట్లాడుతూ...అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఎఐటియుసి సంపూర్ణ మద్దతునిస్తుందని పేర్కొన్నారు. మూడు మాసాల నుంచి వివిధ రూపాల్లో ప్రభుత్వంతో అంగన్‌వాడీలు సంప్రదింపులు జరుపుతుంటే...ప్రభుత్వం పట్టించుకోనందున... చేసేది లేక సమ్మెకు దిగిన అంగన్‌వాడీల ఉద్యమాన్ని బెదిరింపులతో ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి చూస్తుందని అన్నారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మీ మాట్లాడుతూ... అంగన్‌వాడీల పట్ల ఎటువంటి భేషజాలకు పోకుండా తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి మాట్లాడుతూ...వేతనాలు పెంపు, గ్రాట్యూటీ, ఇతర సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు ఇచ్చి ప్రజాస్వామ్య పద్ధతిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై నిర్బంధం ప్రయోగిస్తూ.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక నియంత పాలనను గుర్తు చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ నెల 11,12 తేదీల్లో తమను చర్చలకు పిలిచిన ప్రభుత్వం, న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరిస్తామని హామీనివ్వకపోగా, సమ్మె విరమించకుంటే గైర్హాజరుగా పరిగణించి, తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డివి.కృష్ణ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి శిష్టి, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, కోశాధికారి జయనీ రత్నకుమారి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎ.కమల, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు, సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి.సుధాకర్, యూనియన్ నాయకులు యల్లారాణి, ఉమాదేవి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అధ్వర్యంలో అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు తిరువూరులో కొనసాగింది. ముందుగా మెయిన్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.కుమారి, మండల నాయకులు ఎం.నాగమణి, ఎం.లక్ష్మి, సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్, నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పద్మ, ఎం.నాగమణి, నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు. **మైలవరం :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె రెండో రోజైన బుధవారం కూడా స్థానిక సిడిపిఓ కార్యాలయం వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, ఇబ్రహీంపట్నం సిఐటి మండల కార్యదర్శి మహేష్ మాట్లాడారు. సిఎం జగన్ మొద్దు నిద్ర వీడాలని అంగన్వాడి లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆర్వేవి పుష్పకుమారి, కార్యదర్శి సిహెచ్ శారద, సెక్టార్ లీడర్స్ విజయలక్ష్మి, మాణిక్యం, రబ్బాని, బుల్లెమ్మ, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళనకు దిగారు. నినాదాలు చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు టిడిపి మద్దతు తెలిపారు అంగన్వాడీలు చేస్తున్న ధర్నాకు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి మధు కుమారి, అంజమ్మ, సువర్చల, రత్నకుమారి, మేరమ్మ, విశాలాక్షి, జానమ్మ, నాగ చంద్రిక, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. **నందిగామ:**అంగన్‌వాడీ సమ్మెకు టిడిపి నాయకులు తంగిరాల సౌమ్య సంఘీభావం తెలిపారు. రెండో రోజు సమ్మెలో సిఐటియు మ ండల కార్యదర్శి కటారపు గోపాల్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కల్లి సరళ, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలో...


తిరువూరులో...


మైలవరంలో...


జగ్గయ్యపేటలో...


నందిగామలో

తాతకుంట్లలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - విస్సన్నపేట: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాలపై అవగాహన కార్యక్రమం బుధవారం తాతకుంట్ల గ్రామంలో నిర్వహించారు. ఎంపిడిఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయుష్మాన్ కార్డులు, రైతులకు సబ్సిడీ రుణాలు, ఐసిడిఎస్ బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాతకుంట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రొద్దుటూరు వెంకటేశ్వరరావు ,ఎంపీటీసీ మేడతిరుపతిరావు, తాతకుంట్ల గ్రామ వైసిపి అధ్యక్షులు షేక్ కాలేషా, విసన్నపేట వాసవి ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పులపాక శ్రీనివాసరావు, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కోఆర్డినేటర్ ఓబీసీ జిల్లా కార్యదర్శి పిల్లి ఎలమందల రావు, తదితరులుపాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ వ్యాగన్ వర్క్ షాప్స్ డివిజన్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ సంఘ్ 224వ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం జరిగిన ఎస్‌సీఆర్ఈ సంఘ్ వర్క్ షాపు బ్రాంచి గుంటుపల్లి బీఈసీ మీటింగ్‌లో గద్దా సురేష్‌ను కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. కార్యక్రమానికి బ్రాంచి అధ్యక్షుడు పామర్తి శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి విమల్ సాయి, వైస్ చైర్మన్‌లు కె.లాలియా నాయక్, ఎం.డి.రబ్బానీ, కె.శంకరరావు, అసిస్టెంట్ సెక్రటరీలు జి.సుధాకర్, ఎస్.బోయజ్, ఆర్.నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమం చేపట్టిందని వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామాగ్రిని ఆయన పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వై. విష్ణుప్రసాద్, మండల వైసీపీ నాయకులు రామినేని వీరాస్వామి నాయుడు (బుజ్జి) , ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొని ఉన్నారు. **వీరులపాడు :** జుజ్జూరు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్లను పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఏసుబాబు మండల పరిధిలో ఉన్న 15 సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు సురేష్ రాజశేఖర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో శిక్షణ

ప్రజాశక్తి - మైలవరం : క్షేత్రస్థాయిలో ఆన్ ద జాబ్ ట్రైనింగ్‌కు ఇస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మి కుమారి సూచించారు. వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ ప్రథమ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఆయా సచివాలయాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల పనులు, నిర్వహణ, కంప్యూటర్ వినియోగం, సచివాలయాల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సరళ కుమారి, లెక్చరర్లు లక్ష్మీ రాజ్యం, రాధాకష్ణ పాల్గొన్నారు.

నూతన మందిరం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణం పాత బైపాస్ గ్యాస్ కంపెనీ రోడ్‌లో నూతన మందిర ప్రతిష్ట మరియు సెమీ క్రిస్మస్ ఆరాధన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని 7వ సిద్ధార్థ నగర్‌లో మంగళవారం రాత్రి ఇనుపనూరి జయరాజు నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి సామాన్లు, వస్తువులు మంటల్లో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ బుధవారం దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. ఇనుపనూరి జయరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


ఇంటిని పరిశీలిస్తున్న దృశ్యం

పాల సంఘాల రైతులకు బోనస్‌లు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు చిల్లింగ్ సెంటర్ పరిధిలో పాల సంఘాలకు 2023-24 సంవత్సరంలో రెండో విడత బోనస్‌ను రైతులకు అందజేశారు. పాలశీతల కేంద్రంలో కష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ బొడ్డు రామచంద్రరావు మొత్తం రూ.1,65,70,854 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ టి.సాంబశివమూర్తి మాట్లాడుతూ రైతు పక్షపాతిగా పేరొందిన కష్ణా మిల్క్ యూనియన్ డాక్టర్ వర్గీస్ కురియన్ మార్గ నిర్దేశాలకు అనుగుణంగా పని చేస్తున్న సంస్థ కష్ణా మిల్క్ యూనియన్ అన్నారు. కురియన్ వినియోగదా రుని నుండి ఆర్జించిన ప్రతి రూపాయిలో 80 శాతం రైతుకు చేరినప్పుడే సహకార స్ఫూర్తికి సార్థకం అని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తచేశారు. అవిధంగానే కష్ణా మిల్క్ యూనియన్ వినియోగదారుని నుండి ఆర్జించిన ప్రతి రూపాయి 86 శాతం పాడి రైతులకు అందజేస్తున్న ఏకైక సంస్థ అని తెలిపారు. పాడి రైతు సంక్షే మం, పశు సంక్షేమం క్రింద ఈఆర్థిక సంవత్సరంలో సుమారుగా రూ.60 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నా రు. 2023-2024 లో ఆర్థిక టర్నోవర్ రూ.1200 కోట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ సభ్యులు విజయలక్ష్మి , సత్యనారాయణ, సుశీల, రంగా రావు, సూపర్వైజర్లు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని చిల్లకల్లు పాల శీతల కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాల సంఘాలకు కష్ణా మిల్క్ యూనియన్ వారు పోసిన పాలకు 10శాతం వెన్న శాతానికి రూ.80లు ధర ఇస్తూ, అదనంగా ధర వ్యత్యాసం (బోనస్)గా ఆగస్టు నుండి నవంబరు వరకు పోసిన పాల విలువకు నూటికి 10శాతం చొప్పున బోనస్‌గా, కోటి రూపాయలపైనే విడుదల చేసినట్లు కష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు చెరుకూరి లవయ్య, ట్రస్టు సభ్యులు యింజం రామారావు తెలిపారు. చిల్లకల్లు పాల శీతలీకరణ కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకల్లు బిఎంసి పరిధిలోని గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల తరుపున చైర్మన్ చలసాని ఆంజనేయులుకు కతజ్ఞతలు తెలిపారు. నూతనంగా కామధేను ప్రాజెక్టు కింద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'నూతన మిల్క్ ఫ్యాక్టరీ' ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 కోట్ల రూపాయల బోనస్ విడుదల చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు పాల సంఘ అధ్యక్షులు తోట కొమరయ్య, మాంగోల్లు పాల కేంద్రం అధ్యక్షులు బొల్లం నరసింహా రావు, గండ్రాయిపాల కేంద్రం అధ్యక్షులు రామ్మోహన్ రావు పాల్గొన్నారు.


తిరువూరులో బోనస్ పంపిణీ

అన్నసమారాధన

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక అజిత్‌సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. గత 23 నెలల నుండి కళ్లే లలిత భౌతికంగా దూరమైన నాటినుండి ఆమె జ్ఞాపకార్థం ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా పేదలకు సింగ్‌నగర్ ప్రాంతంలోని కళ్ళే లలితవీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు, ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, కళ్ళే జయదుర్గ, సభ్యులు, పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాలని కేంద్ర బృందానికి వినతులు



కేంద్ర బృందానికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు ఆర్‌సిపి రెడ్డి

ప్రజాశక్తి-గుడివాడరూరల్: ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పంట నష్టపరిహారం అందజేయాలని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గుడివాడ మండలం రామనపూడి వద్ద అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం కమిటీ సభ్యులకు ఆయన వినతిపత్రం అందజేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంట మిగ్‌జాం తుపానుకు దెబ్బతిందని రైతులను ఆదుకోవాలని ఆయన కేంద్ర బృందాన్ని కోరారు. అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, బృంద సభ్యులు రైతులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. మినుము విత్తనాలు కుళ్లిపోయాయని రైతులు చెప్పగా వాటిని పొలంలో నుంచి తెప్పించుకుని పరిశీలించారు. టిడిపి నియోజకవర్గ బాధ్యుడు వెనిగండ్ల రాము రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మీగడ మురళీధర్, ఆర్డీవో పద్మావతి, ఏడీఏ రమాదేవి, తహసీల్దార్ ఆంజనేయులు, ఏవో అనంతలక్ష్మి, ఆర్‌బి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి-కంకిపాడు: తుపాన్ వలన పనులు కోల్పోయిన వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ పంట నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పవన్ కుమార్ అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తుపాన్ కారణంగా వ్యవసాయ కార్మికులు పని దినాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణ పెరిగి పనులు లేక ఇబ్బందులు పడుతున్నా నేపథ్యంలో తుఫాను కారణంగా దొరుకుతున్న కాస్తో కూస్తో పనులు కూడా లేకుండా పోయాయని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కల్పించే పనుల్లో కొన్ని పనులు తొలగించడం (నీటి తిరువాకు అడ్డంగా ఉన్న గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, చిల్ల చెట్లు నరకడం వంటి పనులు) వలన వర్షపు నీరు పొలాల నుండి బయటకు పోకుండా పంటకాలువల్లో నీరు నిల్వ ఉండడం వలన రైతులు పంట మొత్తం నష్ట పోయారని అన్నారు. కావున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తొలగించిన పనులను తిరిగి చేర్చాలని కోరారు. దీనితో పాటుగా తుపాను సహాయంగా నిత్యావసర వస్తువులను అంబించలని, ఉపాధి పని దినాలు పెంచాలని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు కేటాయింపు పెంచాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో మరియదాసు, జోజి, రవి ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నంలోని హెడ్ పోస్టుఆఫీస్ ముందు ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు బూరా సుబ్రహ్మణ్యం, ఐసిఈయు డివిజన్ కార్యదర్శి కిషోర్‌కుమార్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీవరరావు, కె.అమలేశ్వరరావు, ప్రకాష్, బి.రామకృష్ణ, మెరారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల: రైతులు వరి పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్స్ శాస్త్రవేత్తలు వీడి జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని తాడంకి గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. రైతులు రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేయించుకుని నష్టపరిహారం పొందాలన్నారు. అనంతరం మైదుకూరు, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఏడి పద్మజ, ఏవో గణేష్‌రెడ్డి, కావ్యరెడ్డి పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా జయగోపాల్ నియామకం



ప్రజాశక్తి-అవనిగడ్డ: వైసిపి యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అవనిగడ్డకు చెందిన మాజీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ నియామకం అయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నియామక ప్రకటన జారీ చేసినట్లు బుధవారం జయగోపాల్ విలేకరులకు చెప్పారు. ఈ పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ప్రజాశక్తి-ఘంటసాల: కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో చైర్మన్ మరియు సీఈఓ ఆదేశానుసారంగా నాబార్డ్ వారి సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం బుధవారం ఘంటసాల జలదీశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల, కొత్తపల్లి గ్రామాల్లో కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు ఆధ్వర్యంలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరు కూడా పొదుపు ఖాతా తెరవాలని, పొదుపు ఖాతా వలన కలిగే లాభాలు, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు మరియు నగదు రహిత లావాదేవీలు ఏటీఎం రూపే, డెబిట్ కార్డ్ వాడకం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఘంటసాల బ్రాంచ్ మేనేజర్ పీవీ శ్రీనివాసరావు, ఘంటసాల పిఎసిఎస్ చైర్పర్సన్ వేమూరి రత్న శేఖర్, సొసైటీ సీఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

పరిహారం కోరుతూ వినతి



ప్రజాశక్తి-ఘంటసాల: పనల మీద ఉన్న పొలాలను కూడా ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఘంటసాల తహసీల్దార్ బి రామానాయక్‌కి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. తుపానుకు పడిపోయి నీట మునిగిన పొలాలను మాత్రమే ఎన్యూరేషన్ చేస్తున్నారని, కోతకోసిన పొలాలు నీటిలో మునిగిపోయి పనలన్నీ మొక్కలు వచ్చి కుళ్లిపోతున్నాయని వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, సిపిఎం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరావు, అంకం వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గన్నవరం: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వికేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని వికేఆర్ కళాశాలలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఫుడ్‌ఫెస్ట్ కార్యక్రమం ద్వారా వచ్చిన లాభాన్ని పేద విద్యార్థులు డి.సజిదా, ఎ.కాక్షయని, జి.కిరణ్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజాకుమారి, జనని, రాజేశ్వరి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి కేసరపల్లి టౌన్ ఫీడర్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపిసిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధవరం, బూతుమిల్లిపాడు, జక్కులనెక్కలం జగనన్న కాలనీ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాన్యకు అభినందన

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 8 నుండి 10 వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్రవంతి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని దాసరి మాన్యను ప్రిన్సిపల్ కొమ్మినేని రామకృష్ణ బుధవారం అభినందించారు. జనవరిలో ఆంధ్రాలో జరిగే అండర్-14 జాతీయ ఫెన్సింగ్ పోటీలలో మాన్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తుందని కోచ్ ధనియాల నాగరాజు తెలిపారు.

గంజాయి విక్రేతలకు జైలు

ప్రజాశక్తి-మొవ్వ: నిడుమోలు గ్రామంలో 2021 సంవత్సరంలో గంజాయి విక్రయిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులపై నేరం రుజువైంది. ఈ క్రమంలో ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ మచిలీపట్నం ఏడిజే కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు కూచిపూడి ఎస్సై డి సందీప్ బుధవారం విలేకరులకు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి-కోడూరు: కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కిట్లను గ్రామ సచివాలయ కార్యదర్శులకు జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసరావు, వెన్నా ప్రసాద్, ఆలా వెంకటరమణ స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు వైసీపీ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చేతుల మీదుగా క్రీడా పరికరాలను అందజేశారు. మండల పరిధిలోని పలు సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ తదితర పోటీలకు సంబంధించిన పరికరాలను కడవకొల్లు నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమలీదేవి, తాసిల్దార్ రామకృష్ణ, మాజీ సర్పంచులు నలుకుర్తి పథ్వి రాజు, సైకం బాబురావు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



ప్రజాశక్తి-కోడూరు: విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎఇ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల గృహాలను, వాణిజ్య సముదాయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు 34 బృందాలుగా ఏర్పడి 1783 గృహాలను, 133 వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. ఆరు సర్వీసులకు రూ.6 వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్, అవనిగడ్డ డిఇ సుబ్రహ్మణ్యం, చల్లపల్లి డిఇ శివనాగేశ్వరరావు, కోడూరుఏఇ గోపీచంద్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని దింటిమెరక గ్రామంలో బుధవారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మీసాల రాణి నాంచారమ్మ, బడే హేమ గంగాధర్, వెన్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 15వ తేదీన గన్నవరం రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట జరిగే శిబిరంలో మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు కృష్ణసాయి, దంత వైద్యశాల వైద్యులు వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్ చింతగుంటపాలెం గుండుపల్లి వారి వీధిలో ఉంటున్న బత్తుల నాగలక్ష్మికి ఇటీవల జరిగిన ప్రమాదంలో మెదడుకు రక్తస్రావం జరిగింది. మచిలీపట్నం జనసేన ఇంచార్జి బండి రామకృష్ణ బాధితురాలికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంపుగడవల చౌదరి, డివిజన్ ఇన్చార్జిలు సిహెచ్.కొండ మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్‌టిసి ఉద్యోగుల ఆందోళన



ప్రజాశక్తి-ఉయ్యూరు: న్యాయమైన డిమాండ్ల సాధన, సమస్య పరిష్కారం కోసం ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీపీటీడీ ఉద్యోగులు రెండో రోజు బుధవారం ఉయ్యూరు ఆర్టీసీ డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కేవీరావు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ఇతర ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. యాజమాన్య వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షుడు రమేష్, వైస్ చైర్మన్ పిచ్చయ్య, సెక్రటరీ పీఎం కృష్ణ, ప్రెసిడెంట్ కేవీఎస్ రావు, మహిళా నాయకులు రంగమ్మ, అజిత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎంఎల్‌ఎ మొండితోక జగన్‌మోహన్ రావు బుధవారం ప్రారంభిం చారు. మండలంలోని జయంతి గ్రామంలో రైతులు పండించిన పంటలకు వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గడప గడప కార్యక్రమంలో సచివాలయానికి రూ.20 లక్షలు గ్రామ అభివృద్ధి కోసం మంజూరు చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు గ్రామంలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న అధికారులు రైతులకు ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా దాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు జంగా కోటిరెడ్డి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోటేరు శ్రీలక్ష్మి మాజీ జడ్పిటిసి కోటేరు ముత్తారెడ్డి జడ్పిటిసి కీర్తి సౌజన్య మరి అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల పొట్ట కొడుతున్న జగన్

టిడిపి నాయకులు బేగ్ ధ్వజం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిరు వ్యాపారులను సైతం వదలకుండా వారిని వేధిస్తున్న జగన్ ప్రభుత్వంపై వ్యాపారులు ఆగ్రహంతో వున్నారని టిడిపి నాయకులు ఎంఎస్.బేగ్ ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాల మేరకు 37వ డివిజన్ అధ్యక్షులు పిళ్ళా సుదర్శన్ రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బూర కనకరావు ఆధ్వర్యంలో ఎంకె. బేగ్ ఓల్డ్ మార్కెట్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అడ్డూరి లక్ష్మి, మెండు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

20, 22 వార్డుల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో 20, 22వ వార్డులో బ్రాహ్మణ వారి వీధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిడిపి ఎం.ఎస్. బేగ్ డిమాండ్ చేశారు. బుధవారం పశ్చిమ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కంటే వెయ్యి ఎక్కువ ఇస్తామని చెప్పిన జగన్ దారుణంగా వారిని మోసం చేశారని విమర్శించారు. 2019 జూన్‌లో అంగన్వాడీ కార్యకర్తల వేతనాన్ని వెయ్యి రూపాయలు పెంచి పదివేల ఆదాయ పరిమితి నిబంధనను దాటిపోయిందని సాకుతో సంక్షేమ పథకాలు వారికి వర్తింపకుండా చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల, ఆశా వర్కర్లు ఆశించే హామీలను పూర్తిగా నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి 50వ డివిజన్ అధ్యక్షులు కొప్పుల గంగాధర్ రెడ్డి, భోగవల్లి నాగబాబు, జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి బూర కనకారావు, పశ్చిమ నియోజకవర్గం వాణిజ్య విభాగ కార్యదర్శి దాసరి దేవేంద్ర సాయి, మైనార్టీ సెల్ కార్యదర్శి ఇమ్రాన్, యూనిట్ ఇన్చార్జ్ గంటా రాజు, అజీజ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే అభ్యర్థుల మార్పు'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాబోయే ఎన్నికల్లో జగన్ కనుమరగవడం ఖాయమని ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురామ్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో రఘురామ్ నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి 5 సంవత్సరాల పరిపాలన కాలం చివరికి వచ్చిందని, ఇంకా మూడు నెలల కాలమే మిగిలుంది, జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది అందుకే అభ్యర్థుల్ని 11 మందిని అటు ఇటూ మార్చారని ఎద్దేవా చేశారు. మళ్లీ గెలిచే ప్రసక్తి లేదంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గింజపల్లి రమేష్ గారు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని ఎపిఎస్‌ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. బుధవారం డిపో గేటు వద్ద నిర్వహించిన ఈ ధర్నాలో కార్మిక నాయకులు, ఉద్యోగులు మాట్లాడారు. ఇపిఎస్ 95, సిపిఎస్ ఆప్షన్లను నిలిపివేయాలని కోరారు. ఉద్యోగికి ఎప్పుడూ ఇచ్చే వెసులుబాటు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇహెచ్‌ఎస్ విధానం రద్దు చేసి గతంలో ఉన్న పరిమితి లేని వైద్య విధానం కొనసాగించాలని 1/2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలు ఎప్పటినుంచి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2017 పే స్కేల్‌లో ఏరియర్స్ ఉద్యోగులకు చెల్లించాలని రద్దు చేసిన సర్వీసులు వెంటనే పునర్దించాలని స్పాట్లో బస్సులను పిబిఎస్ పెట్టే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. డిపో మేనేజర్ కండక్టర్, డ్రైవర్లను ఈ పీకే, కెఎంపిఎల్ పేరుతో వేధించే విధానం మానుకోవాలని కోరారు. బస్సులు కండీషన్ బాగా పోయిన సరైన స్పేర్ పార్ట్స్ లేకపోయినా అకారణంగా డిపో మేనేజర్ చాట్ సీట్ ఇచ్చే విధానం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ పి.శ్రీనివాసరావు డిపో అధ్యక్షులు జీవీ.ఆంజనేయులు, డిపో చైర్మన్ కె.నరసింహారావు, గ్యారేజ్ సెక్రెటరీ కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బియ్యం రావు డ్రైవర్ అసోసియేషన్ సెక్రెటరీ జయశ్రీ కమిటీ సభ్యులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

మొలకెత్తిన ధాన్యాన్నీ కొంటాం : ఎంఎల్‌ఎ రక్షణనిధి



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రక్షణ నిధి

ప్రజాశక్తి - తిరువూరు : తుఫాన్‌కు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని, రైతులెవరు అధైర్య పడొద్దని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరులోని తన కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్ట అంచానపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో తడిసి మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని చెపారు. నష్టపోయిన రైతులను గుర్తించే విషయంలో. అవకతవకులకు పాల్పడొద్దని అధికారులకు, సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడి, మండల వ్యవసాయ అధికారులు పి.పద్మావతి, రాజ్యలక్ష్మి జడ్పిటిసిలు వై. రామచంద్రారెడ్డి బి .లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న నందిగామలో సామాజిక సాధికార బస్సు యాత్ర



ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్

ప్రజాశక్తి - నందిగామ : డిసెంబర్ 17న నందిగామలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందని ఎంఎల్సి మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సామాజిక సాధికారతకు సజీవ సాక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన సాగుతుందని తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సీఎం వైయస్ జగన్ చేసిన మేలును వివరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతున్నామని తెలిపారు.

ఆట పాటలతో వనసమారాధన



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం కార్తీక వనసమరాధన నిర్వహించారు. విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆట పాటలతో గడిపారు. మ్యూజికల్ చైర్స్, పోటోటో చిప్స్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

వన్‌టౌన్ : ద్విచక్ర వాహనాల చోరీ చేసిన కేసులో ఓ వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చింతపల్లిపాడు గ్రామం, యద్దన పూడి మండలం, ప్రకాశం జిల్లా ప్రాంతానికి చెందిన పాలపర్తి నాగరాజు (28) వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో నాలుగు మోటార్ సైకిళ్ళను దొంగతనానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్.ఐ. రఘునాథ్ నాలుగు మోటార్ సైకిళ్ళను రికవరీ చేసి నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు నాగరాజును సిఎంఎం కోర్ట్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మేజిస్ట్రేట్ విజయవాడ జిల్లా జైలుకు రిమాండ్ ఇచ్చినట్లుగా ఇన్స్పెక్టర్ రావి సురేష్ రెడ్డి తెలిపారు. **(ప్ర.వి)**

ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : సాహిత్య,సాంస్కృతిక సేవా సంస్థ 'శ్రీశ్రీ కళావేదిక' అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో నిర్వహించనున్న "ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాలు 2023" బ్రోచర్‌ను ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు విజయ వాడలోని మాచవరంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి. విజయబాబు మాట్లాడుతూ ప్రతి నెలా ఒక్కోజిల్లాలో సాహిత్య,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడే ప్రతీకార్యక్రమం కూడా స్ఫూర్తిదాయకమైనదేనన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఉమ్మడి కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షులు, ప్రపంచ కళా ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ మెంబరు డా వ కే.ఆర్.జి.శేషుకుమార్ మాట్లాడుతూ ఈ నెల 16,17 తేదీలు శని,ఆదివారాలలో నాన్ స్టాప్ గా 30గంటల, 30నిమిషాల, 30సెకన్ల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సుమారు 600 మందికి పైగా కవులు,రచయితలు,కళాకారులు, సాహిత్యాభిమానులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో ఆంధ్రప్రదేశ్ దళిత్ లెక్చరర్స్ రాష్ట్ర అధ్యక్షుడు డావ కొల్లేటి రమేష్, శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జిల్లా ప్రతినిధి దుంపల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

26న దుర్గగుడికి కలశ జ్యోతుల ఊరేగింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మార్గశిర పౌర్ణమి సందర్భంగా ఈనెల 26వ తేదీ సాయంత్రం 6.00 గంటల నుండి సత్యనారాయణ పురంలోని శివరామ కృష్ణ క్షేత్రం నుండి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానానికి కలశ జ్యోతులతో భవానీలు ఊరేగింపు జరుగుతుందని ఆలయ అధికారులు బుధవారం తెలిపారు. తొలుతగా 13వ తేదీ బుధవారం నుండి ఈనెల 17వ తేదీ వరకు అర్ధమండల దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 2024 జనవరి 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు భవానీ మాలాలు ధరించిన వారు ఇరుముడి, అగ్నికుండములు ప్రారంభమౌతాయని, మాలా విరమణ మహోత్సవం జరుగుతుందన్నారు. 7వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతి కార్యక్రమంతో భవానీ దీక్షల కార్యక్రమం సమాప్తి అవుతాయని తెలిపారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన పసుపులేటి రాజేష్ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. గ్రామ టిడిపి అధ్యక్షులు రావూరి విశ్వనాథం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, జగ్గయ్య పేట టిడిపి ఇన్చార్జి శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య సమక్షంలో చేరారు. ఈ కార్యక్ర మంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సంక్షేమ పథకాలు పొందని ఇల్లు లేదని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు అన్నారు. పట్టణంలోని 11వ సచివాలయం 23, 24 వార్డులలో ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను ఆదేశానుసారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గ్రామ, వార్డ్ సచివాలయాలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజల ముంగిటికే తీసుకువచ్చారని అన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ సచివాలయాలు కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, 24 వ వార్డు కౌన్సిలర్ సాధుపాటిరాజు పాల్గొన్నారు.

ఇద్దరిపై సైకో దాడి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణ పరిధిలో ఆటోనగర్ సమీపంలో మంగళవారం రాత్రి షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన వ్యక్తిని సైకో గాయపరిచాడు. గాయపడిన క్షతగాత్రులను విజయవాడ ఆసుపత్రికి తరలిం చినట్లు సమాచారం. మరలా బుధవారం ఉదయం వెంకట సాయి ఫుడ్ ప్లాజా వద్ద పనిచేసుకుంటున్న వ్యక్తిపై ఆకస్మాత్తుగా కర్రతో దాడి చేశాడు. అనంతరం సమీపంలోని ఇంట్లోకి దూరి ఇద్దరు మహిళలపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. స్థానికులు నివారించే ప్రయత్నం చేయగా వారిపై కర్రతో దాడికి దిగాడు. స్థానికులందరూ చాకచక్యంగా సైకోని పట్టుకొని కాళ్లు, చేతులు కట్టేసి పోలీసులకు అప్పగించారు.

వరికోత యంత్రం అందజేత

జగ్గయ్యపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతులకు ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల కొరతను నివారించడానికి వైయస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. బుధవారం జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో రావిరాలకు చెందిన ఐదుగురు సీహెచ్ సీ రైతులకు సబ్సిడీపై మంజూరైన హార్వెస్టింగ్ మిషన్ (వరికోత యంత్రం)ను అందజేశారు.

అంగన్‌వాడీలకు మద్దతు

కృష్ణాజిల్లాలో రెండో రోజూ కొనసాగిన సమ్మె


పామర్రులో...


అవనిగడ్డలో...


బంటుమిల్లిలో మాట్లాడుతున్న నరసింహారావు

డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కృష్ణాజిల్లాలో రెండో రోజు బుధవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది. సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఐసిఇయు, బిఎస్‌పి తదితర పార్టీలు, సంఘాల నాయకులు అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి మద్దతుగా మాట్లాడారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేదిలేదని, సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎన్నికలకు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి హెచ్చరించారు. మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం కష్టంగా మారిందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇచ్చే గౌరవ వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ప్రాజెక్టు అధ్యక్ష ,కార్యదర్శులు సిహెచ్ నాంచారమ్మ, పి.రెజీనా రాణి, లక్ష్మి, అంజలి, విజయశ్రీ, సీతారత్నం, రత్నకుమారి, సుజాత, సౌజన్య, స్వర్ణలత పాల్గొన్నారు. సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నర్సింహారావు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉద్యోగం చేసినా ఉద్యోగ భద్రత లేకుండా పదవి విరమణ చేసేది అంగన్వాడీ కార్యకర్తలేనన్నారు. అంగన్వాడీలు చేసే సమ్మెకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సిపిఐ నాయకులు లింగం పిలిఫ్, బిఎస్పి నాయకులు బాలాజీ, ఐసిఇయు నాయకులు జి కిషోర్ కుమార్, జె సుధాకర్, టి చంద్రబాబు, సిఐటియు నాయకులు బురా సుబ్రమణ్యం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె వి.గోపాలరావు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

గన్నవరం: అంగన్వాడీ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి తెలిపారు. గన్నవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, కనకదుర్గ, నాగలక్ష్మి, రమాదేవి, సాంబ, సిఐటియు నాయకులు పిల్లి మహేష్, బేతా శ్రీనివాసరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: కంకిపాడు అంగన్వాడి ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సంఘీభావం తెలియజేస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. కంకిపాడు ప్రాజెక్టు పరిధిలోని ఉయ్యూరులోని ఐదో వార్డుకు చెందిన అంగన్వాడీ కార్యకర్త ముళ్ళపూడి సౌధారాణి ఇటీవల విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించారు. ఈ విషయమై ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా ఆయన 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం సౌదారాణి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నేరుసు సతీష్, కంకిపాడు ఎండిఓ అనూష, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ ఉయ్యూరు మండల కార్యదర్శి బాలగంగాధర్ పాల్గొన్నారు.

బంటుమిల్లి: అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, శ్రామిక మహిళ కన్వీనర్ ధనశ్రీ, సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పామర్రు: అంగన్‌వాడీలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్ ప్రసాద్ మద్దతు తెలపగా సిపిఎం జిల్లా నాయకులు శీలం నారాయణరావు మాట్లాడారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు శివ నాగేంద్ర, రైతు సంఘం జిల్లా నాయకులు రామాంజనేయ ప్రసాద్, ఐ.రాజు, కే నాగభూషణం, టిడిపి నాయకులు వర్ల కుమార్ రాజా మద్దతు తెలిపారు.

గుడివాడ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు ఎస్ఎఫ్ఐ తన మద్దతు తెలియజేసింది. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎస్.సమరం మాట్లాడారు. జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ అంగన్‌వాడీలకు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల కార్యదర్శి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: అంగన్వాడి కార్యకర్తల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఉప్పాడ త్రిమూర్తులు, తాడంకి నరేష్ తదితరులు మద్దతు తెలిపారు.


గుడివాడలో...




ఉయ్యూరులో...

అవనిగడ్డ: అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట రెండో రోజు కూడా సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్మల జ్యోతి, ఏ నాగమణి, జి సుశీల, కే పాములమ్మ, కాశీ పాల్గొన్నారు.

మొవ్వ: అంగన్వాడీ సిబ్బంది న్యాయమైన పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందనిజిల్లా నాయకులు శీలం నారాయణరావు హామీ ఇచ్చారు. మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయం ముందు ఐసిడిఎస్ కార్యకర్తలు వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు యద్దనపూడి మధు, సీఐటీయూ నాయకులు కరీముల్లా తదితరులు సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వం దిగి రావాల్సిందే...

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం



ప్రజాశక్తి-గన్నవరం: మేము అడిగేది గొంతెమ్మ కోరికలు కాదు... సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయమని అడుగుతున్నాం... ఇప్పటికైనా కళ్లు తెరవండి అంటూ అంగన్‌వాడీలు కోరుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం గన్నవరంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కొనసాగింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అందరూ సమ్మెబాట పట్టడంతో అంగన్వాడీ కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నా అంగన్వాడీలు లెక్కచేయడం లేదు. నాలుగున్నర ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో సమ్మెబాట పట్టామని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని వీడబోమని చెబుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే చాలు


కనకదుర్గ, కేసరపల్లి సెక్టార్

అంగన్వాడీ కార్యకర్తలను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే చాలు. అనంతరం ప్రభుత్వ సదుపాయాలన్నీ మాకు వస్తాయి. గౌరవ వేతనాలతో తమకు పని ఉండదు. వెట్టి చాకిరి నుండి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వం చెప్పిన విధంగా చేయడం తప్ప దాటవేసే దానికి సమయం లేదు. ఎల్లకాలం మమ్మల్ని మోసం చేయలేరు.

న్యాయం చేయమని అడగడం తప్ప


నాగలక్ష్మి, ముస్తాబాద్ సెక్టార్

సమస్యలు పరిష్కరించమని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మాపై చర్యలు తీసుకుంటామని బెదిరించడం సరికాదు. బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదు. న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలి. వేతనం పెంచడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలి. శ్రమ దోపిడీని నియంత్రించాలి. రాజకీయ వేధింపులకు కట్టడి వేయాలి. ప్రభుత్వ ఉద్యోగులం కాకపోయినా తమకు ప్రభుత్వం నుంచి ఏ పథకం రావడం లేదు.

బడ్జెట్ పెంచాలి


రమాదేవి, అంగన్‌వాడీ నాయకురాలు

కేంద్రాలలో వంట చేసేందుకు ఇచ్చిన పాత్రలు పాడయ్యాయి. కొత్త పాత్రలు ఇవ్వడం లేదు. భోజనం వండి పెడితే ఒక్కొక్కరికి రూపాయిన్నర ఇస్తున్నారు. గ్యాసు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. బడ్జెట్ దానికి చాలడం లేదు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా బడ్జెట్ కూడా పెంచాలి. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి. టిఎ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలి.

హామీలన్నీ అమలు చేయాలి


సాంబ, ఆవుటపల్లి

అంగన్వాడి సమస్యల పరిష్కారం అయ్యే వరకు సమ్మె ఆగదు. వేతనం కనీసం రూ.26 వేలు లేకుండా ఎలా బతకాలి. కుటుంబం పోషణ చాలా కష్టమవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలి. కాదని నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం అవుతుంది.

మందకొడిగా ఎన్యుమరేషన్

ప్రజాశక్తి-గన్నవరం: తుపాను కారణంగా గన్నవరం మండలంలో జరిగిన పంట నష్టాల అంచనాపై అధికారులు చేపట్టిన ఎన్యూమరేషన్ మందకొడిగా సాగుతోంది. మూడు రోజులు కురిసిన భారీ వర్షాలకు మండలంలో ముస్తాబాద, బుద్ధవరం, బుతిమిల్లిపాడు, కేసరపల్లి, సావరగూడెం, దాబాజీగూడెం, సూరంపల్లి, గన్నవరం, అజ్జంపూడి తదితర గ్రామాల్లో వరి పంట మునిగి భారీగా నష్టం వాటిల్లింది. తెంపల్లి గ్రామంలో వేరుశనగకు నష్టం జరిగింది. మొక్కజొన్న, మిర్చి పంటలతో పాటు కూరగాయ పంటలు బాగా దెబ్బతిన్నాయి. కోట్లలో పంట నష్టం జరిగింది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో వరి 12,245 ఎకరాల్లో దెబ్బతిందని అంచనా వేశారు. ప్రస్తుతం రెండు రోజులుగా ఎన్యూమరేషన్ కార్యక్రమం చేపట్టారు. మండలంలో 24 ఆర్‌బికె సెంటర్లు ఉండగా 22 సెంటర్లలో పంట నష్టం అంచనాలకు ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు. వర్షాలు తగ్గిన వారం తరువాత ఎన్యూమరేషన్ చేపట్టడంతో పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని రైతులు చెబుతున్నారు. చేలలో నీళ్లన్నీ బయటకు వెళ్లిపోయి పంట ఆరుదలకు వచ్చిందని ఈ పరిస్థితుల్లో ఎన్యూమరేషన్‌కు రావడం వల్ల పంట నష్టం అంచనా వేయడంలో ఇబ్బంది వస్తుందని రైతులు అంటున్నారు. మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ సాగుతోంది. గ్రామస్థాయి అధికారులు వేగంగా కార్యక్రమం చేపట్టడంలో విఫలం చెందుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. వర్షాల సమయంలో జరిగిన నష్టాలను పరిగణనలోకి తీసుకుని ఎన్యూమరేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

15న కేన్సర్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గన్నవరం: రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం, మణిపాల్ హాస్పటల్ విజయవాడ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఉచిత వైద్య శిబిరం ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తపేట సియల్ రాయుడు రోటరీ ఆడిటోరియంలో జరుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జాస్తి విజయ భూషణ్ కుమార్ తెలిపారు. ఇతర వివరాలకు 9866490130, 9949213636లకు సంప్రదించాలని కోరారు.

కౌలు రైతు కంట కన్నీరు

ఎన్టీఆర్ జిల్లాలో భారీగా నష్టపోయిన వైనం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

మిచౌంగ్ తుపాను వల్ల తీవ్రంగా నష్ట పోయిన కౌలు రైతులను ఆదుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టిన కౌలు రైతులకు మిచౌంగ్ కన్నీరు మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 112894 మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేపట్టారు. వీరిలో 35028 మంది పత్తి సాగు చేపట్టగా, 47016 మంది రైతులు వరి పంటలు వేశారు. 2468 మంది పెసలు, 3519 మది మొక్క జొన్న, 24863 మంది రైతులు మిర్చి పంటను సాగు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలో సాగు చేపట్టిన వారిలో అధిక శాతం కౌలు రైతులే. దాదాపు 65 శాతం నుంచి 70 శాతం వరకు కౌలు రైతులు ఉన్నారు. మరో వైపు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 169 గ్రామాలలో పంటలపై మిచౌంగ్ ప్రభావం చూపింది. 4876 హెక్టార్లలో వరి, 98హెక్టార్లలో శనగలు, 6హెక్టార్లలో పెసలు, 16 హెక్టార్లలో కందులు, 15హెక్టార్లలో మొక్క జొన్న, 30హెక్టార్లలో జొన్న, 10హెక్టార్లలో మినుములు పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 5051హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. అయితే మిచౌంగ్ తుపానుకు అధికంగా నష్ట పోయింది కౌలు రైతులే. ఇప్పటికే దాదాపు రూ. 30వేల వరకు ఎకరానికి ఖర్చు చేసిన కౌలు రైతులకు తుపానుకు దెబ్బతిన్న వరిని పనలను ఎండబెట్టి కాపాడుకునేందుకు అదనంగా ఖర్చు భరించాల్సి వస్తోంది. అదనంగా రూ.5వేల నుంచి రూ. 10వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే పడిపోయిన వరిని కోత కోయడం కూడా సమస్యగా మారింది. కోతకు ఇది వరకు గంట సమయం పడితే ఇప్పుడు రెండు, మూడు గంటల సమయం పడుతోంది. దీనికి అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇది వరకు పెట్టిన ఖర్చు కాకుండా తుపాను వల్ల అదనంగా మరో రూ. 15వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఇది కాకుండా కౌలు కంద రూ. 20వేలు చెల్లించాలి. మరో వైపు ధాన్యం కొనుగోలులో పలు ఆంక్షలతో కౌలు రైతులు నష్ట పోతున్నారు. మొలకలు, నూక, తేమ తదితర కాణాలతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆందోళనలు చెందుతున్నారు. అంతేకాకుండా బీమా పరిహారం నిలుపుదల మీద ఉన్న పంటకేనని అధికారులు చెబుతున్నారు. పనల మీదున్న వరి పంటకు , తడిసిన ధాన్యానికి బీమా సౌకర్యం వర్తించదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈక్రాపు కూడా కౌలు రైతులకు ప్రధాన సమస్యగా మారింది. కేవలం 40 వేల మంది మినహా మిగిలిన కౌలు రైతులకు ఈక్రాపు నమోదు యజమాని పేరు మీద నమోదు చేశారు. దీంతో నష్ట పరిహారం కూడా కౌలు రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. మరో మిర్చి సాగులో కూడా 70 శాతం వరకు కౌలు రైతులు ఉన్నారు. కాపు దశలో ఉండటం వల్ల మిర్చి మొక్కలు గాలికి, వర్షానికి నేలరాలి పోయాయి. కాయలు ఉండటంతో ఆ బరువుకి పైకి లేవడం కష్టం. దీంతో మరో మారు కాపుకు రావడం కష్టం. దీంతో దిగుబడి తగ్గి పోతుంది. మిర్చి రైతులైతే ముందుగానే కౌలు చెల్లించారు. ప్రాంతాన్ని బట్టి కౌలు ధర ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా సగటున ఎకరానికి రూ. 25వేల నుంచి రూ. 50వేల వరకు ఉంది. పెట్టుబడి రూ. 1లక్ష నుంచి రూ. 1.50లక్షల వరకు ఖర్చు చేశారు.

25నాటికి హైవే భూ సేకరణ పూర్తిచేయాలి

జెసి సంపత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌హెచ్-163జీలో భాగమైన ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్‌కు సంబంధించి ఎన్‌టీఆర్ జిల్లాపరిధిలో భూసేకరణ ప్రక్రియను ఈనెల 25వ తేదీ నాటికి పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), రెవెన్యూ తదితర శాఖల అధికారులతో బుధవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ నాగపూర్-విజయవాడ కారిడార్ కింద ఎన్‌హెచ్-163జీలో భాగంగా ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్ అలైన్‌మెంట్‌కు 2019లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆమోదం లభించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌టీఆర్ జిల్లాలో గంపలగూడెం, ఎ.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 15 గ్రామాల్లో జరుగుతున్న 243 ఎకరాల భూసేకరణలో భాగంగా 11 గ్రామాలకు సంబంధించి అవార్డులను ఇప్పటికే పాస్ చేసినట్లు చెప్పారు. మిగిలిన నాలుగు గ్రామాలకు సంబంధించిన ప్రక్రియను ఈనెల 25 నాటికి పూర్తిచేయాలని జెసి ఆదేశించారు. ఈసమావేశంలో నేషనల్ హైవేస్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (ఖమ్మం) పీడీ దుర్గాప్రసాద్, భూ సేకరణ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు సమగ్ర భూ సర్వే : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టీఆర్ జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కింద చేపడుతున్న సమగ్ర రీసర్వే పనులు లక్ష్యాలకు అనుగుణంగా జరుగుతున్నట్లు జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో సమగ్ర రీసర్వే పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

ఒకే కుటుంబం ఓట్లు ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, సంక్షిప్త ఓటర్ల జాబితాకు సంబంధించి నమోదవుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని జిల్లా ఇంచార్జ్, జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో భాగంగా బుధవారం ఆయన నగరంలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఓటర్ల జాబితాపై జరుగుతున్న వివిధ కార్యకలాపాలను వివరించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన నాటినుండి ఇప్పటివరకు నమోదవుతున్న ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతను ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న వారిని ఓటర్లుగా నమోదుచేస్తున్నామని చెప్పారు. అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన 12,728 ఓటర్ల నమోదుకాగా, జిల్లా యంత్రాంగం యువ ఓటర్ల నమోదుపై తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తూ నేటివరకు 22,838 మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. 2024 అంచనాతో యువ ఓటర్ల జనాభా ఆధారంగా వ్యత్యాసాన్ని పూరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫామ్ 6కు సంబంధించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 1,34,405 దరఖాస్తులు రాగా, వాటిలో 1,09,930 పరిష్కరించామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న 24,475 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫామ్ 7కు సంబంధించి 1,20,244 దరఖాస్తులు రాగా, వాటిలో 1,03,268 పరిష్కరించామని చెప్పారు.

IN THE HON'BLE COURT OF THE
VI ADDL. SENIOR CIVIL JUDGE
AT: VISAKHAPATNAM
E.P.32/2023 in O.S.3/2020

Between:
Smt. Jamalapurapu Pushpalatha ...D.Hr/Plaintiff
And
Sri Chaparala Venkata Ranga Rao & 7 others ...J.Drs/Defendants

NOTICE

To,
J.Dr No.1: Sri Chaparala Venkata Ranga Rao, S/o. Late Seshayya, Hindu, aged 70 years, Retired Employee, R/at D.No.21/22, [illegible] Autonagar, Visakhapatnam-12
J.Dr No.2: Smt. Chaparala Ramadevi, W/o. Seshu Kumar, Hindu, aged 57 years, Household duties, R/at D.No.11-3-17/2, Ayyappa Nagar, Gangireddula Dibba, Machavaram, Vijayawada
J.Dr No.3: Sri Chaparala Atchut Kumar, S/o. Seshu Kumar, Hindu, aged 27 years, Business, R/at-do-
J.Dr No.4: Chaparala Tejaswi, D/o. Seshu Kumar, Hindu, aged 26 years, Household duties, R/at-do-
J.Dr No.5: Sri Zannu Venkata Ganesh, S/o. [illegible], Hindu, aged 37 years, Business, R/at Flat No. 111, [illegible] Towers, Chinnagantyada, Gajuwaka, Visakhapatnam.

Please take notice that the above E.P.32/2023 in O.S.3/2020 filed by Smt. Jamalapurapu [illegible] posted to 29-12-2023 for your notice and appearance. So you are hereby informed to appear before the Hon'ble VI Addl. Senior Civil Judge Court at Visakhapatnam on 29-12-2023 at 10:30 A.M in person or through an Advocate otherwise an ex-parte order will be passed against you.

BEVARA SATYANARAYANA
KARRI (K) DEEPTHI SREE
Advocates, Visakhapatnam.

మొదటిపేజీ తరువాయి



కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్ఎలు కెపి.సారథి, కైలే అనిల్ కుమార్

ఆదుకోండి

వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కేంద్రం నిధులు విడుదల చేయాలని పెనమలూరు, పామర్రు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ కోరారు. ఎకరా వరి పంటకు రూ.35 వేల నుంచి 40 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నీట మునిగిన వరి పొలాల్లోని ధాన్యం మొలకలొచ్చి నాణ్యత కోల్పోయిందని, కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 10 బస్తాల దిగుబడులు రాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అత్యధిక విస్తీర్ణంలో పంటలను కౌలు రైతులు సాగు చేస్తున్నారని, నష్టపరిహారాన్ని క్షేత్రస్థాయిలో వాస్తవ సాగుదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

టిడిపి నేతల వినతి

కంకిపాడులో కేంద్ర బృందాన్ని టిడిపి నేతలు కలిసి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. ఆ పార్టీ కృష్ణాజిల్లా ఇన్చార్జి, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎలు తంగిరాల సౌమ్య, బోడే ప్రసాద్, టిడిపి పామర్రు, పెడన నియోజకవర్గాల ఇన్చార్జులు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్ తదితరులు బృందాన్ని కలిసి వినతిపత్రం అందించారు.

త్వరలో కేంద్రానికి నివేదిక

కేంద్ర బృందం సారధి రాజేంద్ర రత్నూ

త్వరలో తుపాను నష్టంపై కేంద్రానికి నివేదిక అందిస్తామని రాజేంద్ర రత్నూ అన్నారు. మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టాలను అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర బృందం కృష్ణాజిల్లాలో పర్యటించింది. జాతీయ విపత్తు నిర్వహణ (ఎన్‌డిఎం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ (న్యూఢిల్లీ) నేతృత్వంలో అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం (ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం) సభ్యులైన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఏడి మహేంద్ర చెండేలియా, కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రిత్వ శాఖ విజయవాడ ఎస్ఇ రాకేష్ కుమార్ తుపాను నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న రత్నూ మాట్లాడుతూ పొలాలు ముంపు బారిన పడకుండా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు. కాల్వల మరమ్మతులకు ఉపాధి హామీ నిధులు కేటాయిస్తున్నారు కదా, ఎందుకు డ్రైనేజీలను అభివృద్ధి చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఉపాధి నిధులతో మైనర్ కాల్వల్లో పూడికలు తీస్తున్నారని అధికారులు వివరించారు. మేజర్ డ్రైన్ల అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్రం నిధులు మంజూరు చేయాలని కోరారు. తుపాను నష్టం అంచనాలు రూపొందించడానికి తాము వచ్చామన్నారు. తుపాను నష్టాలను తమ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించిందన్నారు. జిల్లా యంత్రాంగం కూడా నివేదికలు అందజేసిందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచి ఉన్నందున జిల్లా యంత్రాంగం ఇప్పటికే పంట నష్టం అంచనా వేయడానికి ఎన్యుమరేషన్ చేపట్టిందని, ఆ ప్రక్రియ పూర్తయ్యాక సరైన పంట నష్టం అంచనాలు అందుతాయని తెలిపారు. వీటి ఆధారంగా సంపూర్ణ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. నష్టపోయిన రైతులను నిబంధనల మేరకు ఆదుకోవాలని తాము సిఫార్సు చేస్తామన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ అని ... జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి, ఉయ్యూరు ఆర్‌డిఒ, సివిల్ సప్లై జిల్లా ఇన్చార్జి మేనేజర్ డి.రాజు, జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి భాస్కరరావు, జిల్లా ఆర్అండ్‌బి అధికారి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో భారీ మార్పులు?

శాసనసభ్యులు సామినేని ఉదయభాను స్థానంలో ఆయన కుమారుడికి టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహనరావుకు టికెట్ కూడా ఇవ్వకపోవచ్చని సమాచారం. ఆయన సోదరుడు మొండితోక అరుణ్‌కుమార్ ఇప్పటికే ఎంఎల్‌సిగా ఉండడం కూడా ఇందుకు ఒక కారణంగా చెబుతున్నారు. ఇక తిరువూరు ఎంఎల్ఎ రక్షణనిధి కూడా మార్పు చేయవచ్చని తెలిసింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఉన్న ఆరుగురు వైసిపి ఎంఎల్ఎలలో ఐదుగురికి స్థాన చలనంగానీ, టికెట్ దక్కకపోవడంగానీ జరగవచ్చని తెలిసింది.

ఎక్సెల్ ప్లాంట్ పార్కును పరిశీలించిన దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : అభివృద్ధి చెందుతున్న సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లోని ఇన్నవేషన్ పార్కును బుధవారం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్లాంట్‌లో ఆధునీకరణ పనులను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ఎలా జరుగుతుంది, వ్యర్థ పదార్థాల నుండి ఉపయోగపడే వస్తువులను ఎలా తయారు చేస్తున్నారనే దాని గురించి ప్రజలకు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించే మ్యూజియం ఇన్నో పార్కును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈపర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడి హెచ్ శ్రీనివాసు, డిసిపి జుబిన్ సిరెన్ రాయ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF
THE HON'BLE V ADDL. DISTRICT and
SESSIONS JUDGE, VIJAYAWADA
A.R.B.E.P / 0000802/2022
IN
A.O.P. No. 64/2014

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1) Nimmaluri Sankara Rao
2) Sambasiva Rao Valluri ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1,2 / RESPONDENT'S

1) Nimmaluri Sankara Rao, S/o Koteswara Rao, Age-45, Hindu, Driver, D.No. 1-3-35, Gupta Center, Vidyadharapuram, Vijayawada, Krishna District - 520012

2) Sambasiva Rao Valluri, S/o. Narasimha Rao, Age-45, Hindu, Driver, D.No. 1-26, Tenneru, Kankipadu Mandal, Krishna District.

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1,2. The same is posted to 14/12/2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
J.B.C.S. Raju, Advocate, Vijayawada

GENERAL NOTICE
IN THE COURT OF SENIOR CIVIL
JUDGE : GANNAVARAM
S.O.P. NO. 1 OF 2023

Between :
1. శ్రీమతి చిట్టూరి రమాకుమారి
2. మరియు జశ్వంత్,
3. మరియు నేహా
(2వ మరియు 3వ పిటీషనర్లు మైనర్లు కావున వారి తల్లి గార్డియన్‌గా వ్యవహరించబడుచున్నది .... పిటీషనర్లు
మరియు
నిల్ .... రెస్పాండెంట్లు

పై పిటీషన్ నందు పిటీషనర్లు ముగ్గురును వారి దివంగత ఒకట వారి భర్త గారును రెండవ మరియు మూడవ పిటీషనర్ల తండ్రి గారైన చిట్టూరి విదుకొండలు గారు మరణానంతరం వారి ఉద్యోగరీత్యా రావలసిన సొమ్ము సదరు M/S CENTRAL WEAR CORPORATION, న్యూఢిల్లీ వారి డిప్యూటీ జనరల్ మేనేజర్, వారి వద్ద నుండి రావలసిన సొమ్మును రూ.10,12,557-33 పైసలు కొరకు సక్సెషన్ సర్టిఫికెట్ పొందుట కొరకు, సక్సెషన్ ఓ.పి.ని దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఏమైనా ఆక్షేపణలు, అభ్యంతరములు వున్నచో పైన తెలిపిన కోర్టువారి ముందు ది. 29-12-2023వ తేదీ ఉదయం 10-30 ని.ల కల్లా స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ సంబంధిత కాగితాలతో హాజరై వారి వాదన వినిపించగలరు. లేనిచో కోర్టువారు ఏ విధమైన అభ్యంతరములు లేవని నిర్ధారించుకొని తదుపరి చర్య కొరకు తీర్మానం చేయగలరు.

(కోర్టువారి అనుమతితో)
వాయిదాతేదీ : 29-12-2023
గన్నవరం
ది.14-12-2023

పి.వి.ఎస్.సత్యనారాయణ, అడ్వకేట్,
బృందావన్ కాలనీ, విజయవాడ.


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

ధాన్యాన్ని అమ్ముకోనివ్వండి...

కొక్కిలగడ్డలో అధికారులపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-మోపిదేవి: పండించిన ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం ఇవ్వాలంటూ రైతులు అధికారులను నిలదీశారు. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయం వద్ద బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభ జరిగింది. సమావేశంలో భాగంగా అధికారులు ఆయా శాఖల వారి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయ అధికారిని హెప్సిబారాణి పంట నష్టంపై చెబుతుండగా రైతులు జోక్యం చేసుకొని రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులకు పండించిన ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం ప్రభుత్వం ఇవ్వటం లేదంటూ నిలదీశారు. దళారుల నుండి మోసపోకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుంది అంటూ ఎన్నో ప్రకటనలు చేసిన ప్రభుత్వం నేడు ధాన్యాన్ని కొనుగోలు చేయలేక రైతులు వారు పండించిన ధాన్యాన్ని వారే అమ్ముకునే హక్కు లేక రహదారుల వెంబడి గుట్టలుగా ఆరబోసుకొని రోజుల తరబడి కాపలా కాయల్సి వస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలను సాకుగా చూపుతూ తడిసిన ధాన్యం అని చెబుతూ తేమ శాతం పేరుతో ధర ఇష్టానుసారం అడుగుతున్నారు అంటూ మిల్లర్ల వ్యవహార శైలిపై అధికారులు వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి మండలం పరిధిలో రైస్ మిల్లు ఉన్నప్పటికీ ఆన్లైన్ పేరుతో ఎక్కడో 40 కిలోమీటర్ల దూరం ఉన్న కోడూరు మిల్లుకు తరలించాలని చెబుతున్నారని, గత రెండు సంవత్సరాలుగా రవాణా ఛార్జీలు ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదని అన్నారు. ఇప్పటికైనా పండించిన ధాన్యాన్ని రైతు స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఇన్చార్జి ఈవోపీఆర్డి అశోక్ బాబు, పంచాయతీ కార్యదర్శి కె రామకోటేశ్వరరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అధిక నష్టం : మండలి

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలం పూషడంలో మొలకెత్తిన వరి పంటను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు అపార నష్టం కలిగిందని, ఈ ప్రభుత్వం భీమనది ఛానల్ మురుగు డ్రైనేజీలో తూటికాడ, గుర్రపుడెక్క సకాలంలో తొలగించలేదన్నారు. ఫలితంగా ఈ గ్రామంలో 600 ఎకరాల్లో వరి పంట దారుణంగా మొలకలు వచ్చి పంట దేనికి పనికిరాకుండ పోయిందన్నారు. భీమనది డ్రైనేజీకి రూ.12లక్షలు నిధులు కేటాయించినా పనులు జరగలేదన్నారు. తుఫాన్ ముందు సకాలంలో స్పందించి ముంపు నివారణకు చర్యలు తీసుకుంటే అపార నష్టం తగ్గేదన్నారు. ఈ ప్రాంత రైతులకు కలిగిన నష్టానికి ప్రకృతి కారణం కాదని, పాలకుల నిర్లక్ష్యమే ఈ నష్టానికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి తుమ్మల చౌదరి బాబు, పుషడం సర్పంచ్ అంకం మారుతీరావు పాల్గొన్నారు.



పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండల విద్యాశాఖ అధికారి-1 ఎన్. శివశంకరరావు బుధవారం మండలంలోని పెడసనగల్లు ఎంపీ ఎలిమెంటరీ(ఏ.ఏ.) పాఠశాల లో తనిఖీలు నిర్వహించారు, పిల్లల్లో గల అభ్యాసన సామర్థ్యాన్ని, ఉపాధ్యాయుల బోధనలను, పిల్లల నమోదు, విద్యార్థుల హాజరు, జగనన్న గోరుముద్ద నిర్వహణ లతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె శివకుమార్, సహ ఉపాధ్యాయిని కె విజయ కుమారి పిల్లలకు విద్యాబోధన చేసేవిధానాన్ని పరిశీలించారు. అలాగే పిల్లలను తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, పరిసరాల విజ్ఞానం అంశాలలో పలు ప్రశ్నలు వేశారు. జగనన్న గోరుముద్ద ఆహారాన్ని పిల్లలతో పాటు ఆయన కూడాతిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు కంచర్ల ఆంజనేయులు (పెడసనగల్లు), తాతా సమర్పణ రావు (కూచిపూడి) పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.1.10 లక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురులోని ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,70,809లు వచ్చినట్లు దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ వాసు తెలిపారు. బుధవారం దేవస్థానంలో హుండీ తెరిచి ఆదాయం లెక్కించారు. హుండీ ద్వారా మూడు నెలలకు రూ.1,70,809 ఆదాయం లభించినట్లు ఈఓ వాసు తెలిపారు. ఇంచార్జి సీహెచ్ సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, సజ్జా బలరాం, మల్లుపెద్ది త్రివిక్రమరావు పాల్గొన్నారు.

విద్యార్థికి కంటిరెప్ప ఆపరేషన్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మొవ్వ మండలంలోని మొవ్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం అభిలేష్ కు ప్రమాదవశాస్తు గేటు తగిలి కంటి రెపియా తెగిపోవడం తో చూపు దెబ్బ తీసే పరిస్థితి వచ్చింది.మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే అక్కడ కంటి వైద్యుడు డాక్టర్ భాను మూర్తి దాదాపు మూడు గంటలు పైగా శ్రమించి కంటి రెప్పను సరిచేశారు.ఇలాంటి ఆపరేషన్ ప్రైవేట్ ఆసుపత్రి లో దాదాపు లక్షకు పైగా ఫీజు తీస్కుంటారని,అలాంటిది జగనన్న కాంతి వెలుగు కింద ఉచితంగా చేసి కంటి రెప్పను సరిచేసినందుకు తల్లి తండ్రులి హస్టల్ ఆర్డెన్ షమీర్ డాక్టర్ భానుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం దుకాణం తీసేయాలని ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర్లో ఉన్న మద్యం దుకాణాన్ని తీసేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరం డివిజన్ కార్యదర్శి జిల్లా రాజేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మద్యపానం నిషేధిస్తామని చెప్పి విద్యాసంస్థలకు దగ్గరలోనే దుకాణాలిని ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వం ఆచరణలో చూపిచడంలేదన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్‌టిటిఎఫ్ కళాశాల, బాలికల ఎస్సీ బీసీ హాస్టల్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నార్నారు. ఇప్పటికైనా స్పందించి మద్యం దుకాణాన్ని కళాశాల దగ్గర నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ గన్నవరం మండల అధ్యక్షులు




లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కె.నాని, ఉంగుటూరు మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం డివిజన్ కార్యదర్శి చిల్లర రాజేష్, సంతోష్, ఆదర్శ్, సందీప్, చరణ్, నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఆదుకోకపోతే పురుగుల మందే గతి...

ఉంగుటూరు కౌలురైతు ఆవేదన

ప్రజాశక్తి-ఉంగుటూరు: నా పేరు పెద్దిరెడ్డి నారాయణ... కౌలు రైతుని...15 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేశా... ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి





అయింది.. మొత్తం నాలుగున్నర లక్షలు ఖర్చు అయింది. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను రావడంతో పనల మీద మొత్తం మునిగిపోయింది. రోజుల తరబడి నీరు ఉండటంతో ధాన్యం మొత్తం మొలకెత్తి ఎందుకు పనికిరాకుండా పోయింది. మినుములు చల్లుకోవాల్సిన సమయం వచ్చింది. అధికారులు ఎవరూ మాకేసి చూడలేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు... దీంతో పొలం మొత్తం దున్నేస్తున్నా... ప్రభుత్వం ఆదుకోకపోతే పురుగుల మందే గతి.. అంటూ కౌలురైతు కన్నీటి పర్యంతం అయ్యాడు. ఉంగుటూరు మండలం నందమూరులో కౌలురైతు నారాయణ 15 ఎకరాల్లో కోసిన వరి పైరు తుపానుకు నీట మునిగి మొలకలు వచ్చింది. పంట పనికి రాకుండా పోయింది. ట్రాక్టర్‌తో వరి పనలను దమ్ము చేశాడు. అప్పులు తెచ్చి వరి సాగు చేశానని, ఇప్పటివరకు అధికారులు వచ్చి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం పట్టించుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయాడు.

బాలుర వసతి గృహానికి విరాళం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం లోని స్థానిక నోబుల్ కాలనీ లో ఉన్న కెవన్ హెచ్ బాలుర హాస్టల్ లో బాలురకు క్రిస్మస్ పండుగ సందర్భంగా నూతన వస్త్రాల నిమిత్తం 10 వేల రూపాయల విరాళం అందించారు. మైత్రీ ఫౌండేషన్ ద్వారా బాలుర వసతి గృహం అవసరాలు తెలుసుకున్న న్యాయవాది లంకిశెట్టి బాలాజీ బుధవారం ఆయన స్వగృహంలో హాస్టల్ వార్డెన్ ప్రసాద్ కి నగదు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు వేణుకుమార్, సభ్యులు అనిల్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటమి భయంతోనే ఇన్‌ఛార్జిల మార్పు : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఓటమి భయంతోనే జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను మారుస్తున్నారని, ప్రజలే జగన్‌మోహన్‌రెడ్డిని మార్చే రోజులు దగ్గరలో ఉన్నాయని మాజీ ఎంపి, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. ఇటీవల ప్రకటించిన 11 మంది ఇంచార్జుల్లో ఒక్కరూ కూడా



గెలిచే పరిస్థితి లేదని జోస్యం చెప్పారు. నియోజకవర్గానికి నాయకులను మార్చినంత మాత్రాన జగన్ రెడ్డి తలరాత మారదన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నాటకాలు ఆడిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది మాత్రం శూన్యమన్నారు. మంగళగిరిలో గెలుస్తారని తెలిసినప్పుడు సీటు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చి ఓడిపోతారు అని తెలిసినప్పుడు మాత్రం బీసీ సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవికి ఇచ్చారన్నారు. బీసీల మీద జగన్ రెడ్డికి ఉన్న కపట ప్రేమకు ఇదే నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, నాయకులు లంకె శేషగిరి, గోపు సత్యనారాయణ, బచ్చుల సుబ్రహ్మణ్యం (బోస్), బత్తిన దాస్, ఫణికుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలుకు నిబంధనలు సడలించాలి'

ప్రజాశక్తి-మోపిదేవి: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలు సడలించి మద్దతు ధర తో వెంటనే కొనుగోలు చేయాలని టిడిపి నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెదకళ్లేపల్లి, వెంకటాపురం వద్ద ధాన్యం కొనుగోలు లేక రహదారుల వెంబడి ఆరబోసిన ధాన్యాన్ని టిడిపి నేతలు పరిశీలించి రైతుల నుండి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో అనేక నిబంధనలు చెబుతూ కొనుగోలు చేయడం లేదంటూ రైతులు టిడిపి నేతల దృష్టికి తీసుకువచ్చారు. నాలుగు రోజులుగా వాహనాలు రావడం లేదంటూ మరికొద్ది రోజులు సమయం పట్టే అవకాశం ఉందంటూ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా చెబుతున్నారంటూ రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకల్లు సీతారామాంజనేయులు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి శివరామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, ఎంపిటిసి సభ్యులు కొమ్ము పవన్ కుమార్, అరజ వెంకటేశ్వరరావు, చందన రంగారావు ,మోటుపల్లి జనార్ధన రావు తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం : డీఎంహెచ్ఓ



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. జీ. గీతాబాయి స్పష్టం చేశారు. బుధవారం డీఎం అండ్ హెచ్ ఓ చాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అధ్యక్షతన పీసీపీఎన్డీటీ కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ కేంద్రాల కొత్త రిజిస్ట్రేషన్ల కోసం రెండు దరఖాస్తులు, రెన్యువల్ కోసం రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటికి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించి కమిటీ ఆమోదం కోసం సమర్పించగా, వాటిని కమిటీ ఆమోదించిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తన దృష్టికి రాలేదని చెప్తూ స్కానింగ్ కేంద్రాలను తరచూ ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం స్కానింగ్ కేంద్రాలు ఎఫ్ ఫారమ్లో నియమిత కాలంలో ఆన్లైన్లో నివేదికలు సమర్పించే విధంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డీఐఓ డా. ఏ. సీతాకుమారి, పీడియాట్రిషన్ డా. హరిక, గైనకాలజిస్ట్ డా. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

22 నుండి ఫల, పుష్ప ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎస్.వి.ఆర్. ఈవెంట్స్ అధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈ నెల 22 నుండి 27 వరకు ఫల, పుష్ప ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ గరిమెళ్ళ జానకి రామయ్య తెలిపారు. మొగల్‌రాజపురంలోని క్రాస్ రోడ్స్ హోటల్‌లో పుష్ప ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవాసులకు పుష్పాలు వాటి ప్రాధాన్యత, ఆలాగే ఫలాలు అన్ని రకాలు ప్రదర్శనగా ఉంచనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు స్వయంగా ప్రదర్శనలో మొక్కలను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రదర్శన ఈ నెల 22న రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. అతిథులుగా శాసన సభ్యులు మల్లాది విష్ణు, మహిళ కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ, వైసిపి ఈస్ట్ నాయకులు దేవినేని అవినాష్, వై.సి.పి.నగర అధ్యక్షులు బొప్పన భవ కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శనకు ఇప్పటికే 100కు పైగా స్టాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జాన్నీ,ఎస్.జోషి, ప్రకాష్, రఫీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిబిఎస్ఇ విద్యార్థులకు చక్కని తర్ఫీదునివ్వాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, వేలాది కోట్లు విద్యార్థుల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తుందని పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ఒక రోజు అవగాహన సదస్సు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. సాన్యం భరద్వాజ్ (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్) సీబీఎస్ఈ పరీక్షా విధానంపై చర్చ, ప్రశ్నోత్తర' కార్యక్రమం నిర్వహించారు. సీబీఎస్ఈ అమలు చేస్తున్న తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి సీబీఎస్ఈ అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాళ్లు 700 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ కమీషనర్ఎస్.సురేష్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తూ.. 2024-25 నాటికి సీబీఎస్ఈ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మన విద్యార్థుల మంచి ప్రతిభ కనబరిచేలా తర్ఫీదునిస్తూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం డా.సాన్యం భరద్వాజ్ మాట్లాడుతూ 'విద్యార్థుల నమోదు అడ్మిషన్ రిజిస్టర్, పుట్టిన తేదీ ధవీకరణ పత్రానికి సంబంధించి నమోదు సమయంలో వివరాలు ఖచ్చితంగా, తప్పుల్లేకుండా ఉండాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ, మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎం.వి. కృష్ణారెడ్డి గారు, వి.అరుణ (హెడ్ ఆఫ్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్) పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : పేద ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించేలా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు తత ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో 21 మందికి మంజూరైన రూ. 13.85 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో బుధవారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయన్నారు. సెంట్రల్లోని 1,69,376 కుటుంబాలకుగానూ.. 74,585 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు ఇసరపు దేవీ రాజారమేష్, శర్వాణీ మూర్తి, జానారెడ్డి, కుక్కల అనిత, నాయకులు అలంపూర్ విజయ్, యరగొర్ల శ్రీరాములు, ఉమ్మడి వెంకట్రావు, గుండె సుందర్ పాల్, కురిటి శివ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఆధ్వర్యంలో ఆంధ్ర హాస్పిటల్, విజయవాడ, హెచ్.సి.జి. కేన్సర్ హాస్పిటల్, విజయవాడ, శ్రేయ ఇ.యన్.టి. హాస్పిటల్ విజయవాడ, అమరావతి కంటి హాస్పిటల్, విజయవాడ, దుహిత దంత వైద్యశాల, విజయవాడ వారి సౌజన్యంతో కిలేశపురం సచివాలయంలో ఉచిత వైద్య శిబిరంను, ఓ యమ్., డా.యన్.టి.టి.పి.యస్, చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతమ్, గ్రామ సర్పంచ్, కాకి దేవమాత ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాకి దేవమాత మాట్లాడారు. ఇలాంటి వైద్య శిబిరం ప్రతి సంవత్సరంలో రెండుసార్లు నిర్వహించాలని కోరాఉ. సిఎస్ఆర్ నిధులను ఊరికి కేటాయించాని కోరారు. తదుపరి చీఫ్ ఇంజినీర్, ఓ యమ్. డా.యన్.టి.టి. పి.యస్. పి.నవీన్ గౌతమ్ మాట్లాడారు. సి.ఎస్.ఆర్ ఫండ్ విషయం పై అధికారులతో మాట్లాడతామని అన్నారు. ఆంధ్ర హాస్పటల్ వైద్య సిబ్బంది 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, అమరావతి కంటి ఆస్పత్రి వారు 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, దుహిత పంటి వైద్యశాల వారు 60 వైద్య పరీక్షలు నిర్వహించారు, హెచ్.సి.జి. క్యాన్సర్ వైద్యశాల వారు 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, శ్రేయ ఇ.యన్.టి. వైద్యశాల 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 2డి ఎకో, అల్ట్రా సౌండ్ స్కాన్ (కిడ్నీ), థైరాయిడ్, హెచ్. బి.ఎ.1సి, బి.యమ్.డి, షుగర్, బి.పి.పరీక్షలు నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నందిగామ : క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫర్ గర్ల్స్ రీజినల్ లెవెల్ పోటీలను నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్‌మోహన్‌రావు బుధవారం ప్రారంభించారు. తొలుత జెండా ఆవిష్కరణ, క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్, క్రీడాకారుల పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఆటలతో శారీరక దఢత్వం పెరుగుతుందని తెలిపారు. పోటీతత్వం అలవడుతుందని చెప్పారు. గెలుపు సంబంధం లేకుండా కేవలం క్రీడా స్ఫూర్తితోనే మెలగాలని క్రీడాకారులకు సూచించారు. చదువుతోపాటు క్రీడలపై కూడా దష్టి సారించాలన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి, కాసేపు ఆటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ రమేష్, నందిగామ కెవిఆర్ కాలేజి పిడి వాసిరెడ్డి నాగేశ్వరరావు, అధ్యాపకులు కొండయ్య, పుష్పావతి, ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నందిగామ పట్టణంలో డిసెంబర్ 10న ఒసి క్లబ్‌లో జరిగిన 4వ నేషనల్ కుంగ్ఫూ, కరాటే పోటీల్లో చిల్లకల్లు గ్రామానికి చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించిన సందర్భంగా మంగళవారం రాత్రి మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మంగళవారం రాత్రి విజేతలైన తోట సాత్విక, అరబోలు తన్విక్, నాయిని అశోక్, ఎస్కె.నూరుద్దీన్, ఎస్కె.అమన్‌లను, సిల్వర్ మెడల్స్ సాధించిన అరబోలు వర్ష, తోట దీపాన్విత, నాయిని కతిక, పొదిలి ఆకాష్, చల్ల రోహిత్‌లను, బ్రాంజ్ మెడల్స్ సాధించిన నాయిని కపిల్ కౌశిక్, నాయిని గౌతమ్, అరబోలు విక్రాంత్, బత్తుల షణ్ముఖ సాయి, బత్తుల సాత్విక్ సాయి, రూపన సాయికిరణ్, రూపన ఐశ్వర్యాలను నెట్టెం రఘురామ్, శ్రీరాం రాజగోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మ రక్షణ కొరకు కరాటే నేర్చుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, రావూరి విశ్వనాథం, రావూరి శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్నారై విద్యాసంస్థల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య మాట్లాడుతూ సైన్స్‌తో ఎన్నో అద్భుతాలు సాధించొచ్చని, వైజ్ఞానిక శాస్త్రంలో దేశం, మనుషుల పురోగతి సాధ్యమని తెలిపారు. ఎన్నో వందల సంవత్సరాలుగా సైన్స్ ద్వారా అద్భుతాలు చూస్తున్నామని సైన్స్‌ను అందరికీ అర్థమయ్యేలా బోధిస్తూ నేటితరం విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి సైన్స్ పట్ల ఆకర్షితులు అవ్వాలని అందరూ రేపటి కాబోయే సైంటిస్టులుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నాగరత్న, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బూడిద అక్రమ నిల్వలను తొలగించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జూపూడి పరిసర ప్రాంతాలలో నివాసాల మధ్య ఉన్న అక్రమ బూడిద నిల్వలను బుధ వారం స్థానిక ప్రజలతో కలిసి జనసేన మండల అధ్యక్షుడు పోలిశెట్టి తేజ సందర్శిం చారు. ఈ నిల్వలను వారం రోజుల్లో తొలగించక పోతే భారీ ప్రజా పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బూడిద నిల్వల వలన ఇళ్లలో కనీసం వంట చేసుకునేందుకు వీలు లేదని మహిళలు తేజకు తెలిపారు. అనంతరం తేజ మాట్లాడుతూ ఇళ్ల నివాసాల మధ్య ఇంత భారీ స్థాయిలో బూడిదలు అక్రమ నిల్వ చేసి రవాణా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికార ప్రతిపక్ష పార్టీలు బూడిద నిల్వలు మీ వంటే- మీవి అని విమర్శలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు ప్రసాద్, కొండలరావు, సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు బాబూరావు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. దేవీనగర్ 5, 6, 7, 8 లైన్లలో పర్యటించారు. పేదలకు నవరత్నాల కార్యక్రమాల ద్వారా చేకూరిన లబ్ధిని సంక్షేమ బుక్ లెట్లను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. తమను గెలిపించిన ప్రజలకు చేసిన మంచిని గడప గడపకు వెళ్లి తాము చెప్పగలమని.. టీడీపీ హయాంలో పేదలకు ఏం చేశారో చెప్పే ధైర్యం గత పాలకులకు ఉందా..? అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మార్తి చంద్రమౌళి, పవన్ కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, నగర ప్రసాద్, డి.కష్ణా పాల్గొన్నారు.


గడపగడపకూ కార్యక్రమంలో ఎంఎల్ఎ విష్ణు

హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ నుండి నూతన పథకం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ జీవిత భీమా సంస్థలలో ఒకటైన హెచ్. డి. ఎఫ్.సి. లైఫ్ సరికొత్తగా లైఫ్ క్లిక్ 2 అచీవ్ అనే నూతన పథకాన్ని ప్రారంభించినట్లు సంస్థ హెడ్ అనీష్ ఖన్న తెలిపారు.నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు తెలియచేశారు. ఇది హామీ ప్రయోజ నాలను అందించే పొదుపు పదకం అన్నారు. ప్రియమైన వారి భవిష్యత్తును కాపాడేందుకు వారి ఆర్థిక లక్ష్యాలను అందుకోవడం కోసం ఈ ప్లాన్ రూపొందించ బడింది అని తెలిపారు.ఇది పూర్తిగా అనువైనది అని, ముందస్తు ఆదాయం, దీర్ఘ కాలిక ఆదాయం, ఏక మొత్తం లేదా క్రమానుగతగా మనీ బ్యాక్ వంటి ప్రయోజనా లను పొందవచ్చని అన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణ శివారు పల్లగిరి గట్టుపై శివాలయంలో ఉన్న శ్రీ భవాని శంకర స్వామి ఆలయ అభివద్ధికి రూ.1 లక్ష 16 వేల రూపాయల విరాళం ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ బుధవారం అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఎల్సి ని ఆలయ కమిటీ వారు సత్కరించారు.

న్యాయవాదికి ఎంఎల్‌ఎ నివాళి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని 8వ వార్డు ఒసి క్లబ్ సమీపంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది మారెడ్డి రామిరెడ్డి (89) మంగళవారం రాత్రి మృతి చెందారు. న్యాయవాది రామిరెడ్డికి భార్య, పిల్లలు. ఆయన భౌతికకాయాన్ని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పలువురు నాయకులు నివాళు లు అర్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగర వ్యాప్తంగా వివిధ అభివద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని కృష్ణలంక 15,22 డివిజన్లలో రూ.1.10 కోట్ల ప్రభుత్వ నిధులతో నూతనంగా చేపట్టబోయే వివిధ అభివద్ధి కార్యక్రమాలకు అవినాష్‌తో కలిసి మేయర్ భాగ్యలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్, అవినాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్ల రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో నూతన రోడ్లు, సైడ్ డ్రైనేజ్ ,మంచినీటి ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, 15వ డివిజన్ కార్పొరేటర్ బెల్లం దుర్గా, 22వ డివిజన్ కార్పొరేటర్ తాడిపర్తి కొండారెడ్డి, వైసిపి నాయకులు వెంకటరెడ్డి, జోగారాజు, చెన్న రెడ్డి, రమణ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేసిన మేయర్, తదితరులు